ఉత్తరం
# కాకతీయ
TG TEL/25/A1234
www.kakatiyanews.com
శనివారం, 10 అక్టోబర్ 2026 | సంపుటి: 02 సంచిక: 51 | పేజీలు: 4 వెల: 5


## జెండా పాటకే పరిమితమా..?!



- జెండా పాట ధరకు.. రైతుకు చేరేదెంత?
- తక్‌పట్టీ నుంచి వేమెంట్ వరకు లొసుగులపై ఆరా
- యాక్షన్, బిడ్డింగ్ రిజిస్టర్ల నిర్వహణ నిలిపివేత
- ప్రతి లావాదేవీ ఆన్‌లైన్‌లో నమోదయ్యేలా కొత్త సాఫ్ట్‌వేర్
- గన్నీ బ్యాగుల విలువపైనా కమీషన్ వసూలు చేసినట్లు గుర్తింపు
- ఆగస్టు తనిఖీ నివేదికలు రద్దు.. లోతైన పరిశీలనకు ఆదేశాలు
- వారంలోగా టెండర్ ప్రక్రియకు సన్నాహాలు
- మార్కెటింగ్ శాఖ అడిషనల్ డైరెక్టర్ లక్ష్మణుడు

2



సరస్సు నీరు భూగర్భంలోకి లీకయ్యే ప్రమాదం

## ఓపెన్ కాస్టుతో రామప్పకు ముప్పు తప్పదు

- ఇప్పటికే భూమి లోపల చీలికలు ఏర్పడ్డాయి
- ఓపెన్ కాస్టుల బ్లాస్టింగులతో అవి రీయాక్టివేట్ అయ్యే అవకాశం
- రామప్ప సరస్సు కట్ట తెగే ప్రమాదం ఎక్కువగా ఉంది
- పేలుళ్ల ప్రకంపనల ప్రభావం దీర్ఘకాలంలో కనిపించొచ్చు
- గతంలో నిర్వహించిన జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా నివేదికలోనూ ఉంది
- చెరువు కట్ట తెగేతే రామప్ప ఆలయ పరిసరాలు పూర్తి ధ్వంసమవుతాయి
- ఆస్తి, ప్రాణ నష్టం వాటిల్లేందుకు ఆస్కారం ఉంది
- సింగరేణి ఓపెన్ కాస్టు ప్రారంభించే విషయంలో తొందరపాటు పనికిరాదు
- ఓపెన్ కాస్టు ప్రారంభిస్తే రామప్పకు యూనెస్కో గుర్తింపు కూడా పోతుంది
- కాకతీయ హెరిటేజ్ ట్రస్టు ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు లేఖలు రాశాం
- కాకతీయ సాంస్కృతిక, కళా సంపద పరిరక్షణపై ప్రభుత్వం దృష్టిపెట్టాలి
- తెలంగాణ డిజిటల్ మీడియాతో ప్రొఫెసర్ ఎం. పాండు రంగారావు

4

సింగరేణి ప్రతిపాదిత ఓపెన్‌కాస్ట్ గనితో రామప్ప ఆలయం, సరస్సుకు ముప్పు తప్పదు. 300 మీటర్ల లోతు వరకు తవ్వకాలు చేపట్టాలని ప్రతిపాదించిన గని ప్రాంతం రామప్ప సరస్సు, ఆలయానికి దిగువ ప్రవాహ దిశలో సుమారు 5 కిలోమీటర్ల దూరంలో ఉంది. అక్కడ చేపట్టే తవ్వకాలు, బ్లాస్టింగులతో భూమి లోపల ఇప్పటికే ఉన్న చీలికలు మళ్లీ క్రియాశీలమవుతాయి. వాటి ద్వారా సరస్సు నీరు భూగర్భంలోకి లీకవుతుంది. నీటి ప్రవాహంలో మార్పులు, కట్ట కింద భూగర్భ పరిస్థితులపై ప్రభావం కారణంగా రామప్ప సరస్సు కట్ట తెగే ప్రమాదం తీవ్రంగా ఉంటుంది. కట్ట తెగితే దిగువ ప్రాంతాల్లోని ఆస్తులు, పంటలు, ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లడంతోపాటు రామప్ప ఆలయ పరిసరాలు తీవ్రంగా దెబ్బతింటాయి. ఓపెన్‌కాస్ట్ పేలుళ్ల ప్రకంపనలు ఆలయ నిర్మాణంపై దీర్ఘకాలిక ప్రభావం చూపుతాయి. ఈ పరిణామాలు రామప్ప ఆలయ భద్రతతోపాటు యునెస్కో ప్రపంచ వారసత్వ గుర్తింపుపైనా ప్రభావం చూపుతాయి. కాకతీయుల అపూర్వ సాంస్కృతిక, కళా సంపదను ప్రమాదంలోకి నెట్టే ఈ గని విషయంలో ప్రభుత్వాలు తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్, ఇన్‌టాక్ (INTACH) వరంగల్ చాప్టర్ కన్వీనర్, వరంగల్ నిట్ రిటైర్డ్ ప్రొఫెసర్ ఎం. పాండురంగారావు స్పష్టం చేశారు. తెలంగాణ డిజిటల్ మీడియా యూనియన్ ప్రతినిధులతో మాట్లాడిన ఆయన, ప్రతిపాదిత ఓపెన్‌కాస్ట్ గని వల్ల తలెత్తే ప్రమాదాలను, వాటి వెనుక ఉన్న భౌగోళిక కారణాలను వివరించారు. - కాకతీయ, తెలంగాణ బ్యూరో

### నెల రోజుల్లో జీవో 59 దరఖాస్తులకు పరిష్కారం

- 500 గజాల లోపు పెండింగ్ దరఖాస్తులపై ప్రభుత్వ నిర్ణయం
- పారదర్శకంగా క్రమబద్ధీకరణ ప్రక్రియ
- రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



2

### కేసీఆర్ పదేళ్ల పాలనపై అసత్య ప్రచారాలెందుకు?

- వైఫల్యాల నుంచి దృష్టి మళ్లించేందుకే బురదజల్లుడు
- బొగ్గు కొరతతో 5 వేల మెగావాట్ల విద్యుదుత్పత్తికి ఆటంకం
- మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి



2

## 74 లక్షల ఓటర్లకు గ్రీన్‌సిగ్నల్!

### తుది జాబితాలో చేర్చేందుకు ఎన్నికల సంఘం ఆమోదం



- 92.23 లక్షల నోటీసుల పంపిణీ పూర్తి
- 82.11 లక్షల కేసుల విచారణ ముగింపు
- ఇంకా 18.12 లక్షల కేసులపై తేలని నిర్ణయం
- నవంబర్ 9న తుది ఓటర్ల జాబితా
- తెలంగాణ ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ

**కాకతీయ, తెలంగాణ బ్యూరో** : తెలంగాణలో ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో కీలక పరిణామం చోటుచేసుకుంది. వివిధ కారణాలతో ముసాయిదా జాబితా నుంచి తొలగింపునకు గురైన లేదా నోటీసులు అందుకున్న వారిలో విచారణ పూర్తయిన 74,62,851 మంది ఓటర్లను తుది జాబితాలో చేర్చేందుకు ఎన్నికల సంఘం ఆమోదం తెలిపింది. మరోవైపు, ఇప్పటివరకు 12,969 మంది ఓటర్లు అనర్హులుగా తేలినట్లు అధికారులు వెల్లడించారు. ప్రత్యేక సవరణ ప్రక్రియకు ముందు తెలంగాణలో 3,38,26,448 మంది నమోదిత ఓటర్లు ఉన్నారు. ఆగస్టు 17న ప్రచురించిన ముసాయిదా జాబితాలో ఈ సంఖ్య 2,64,87,213కు తగ్గింది. గైర్హాజరు, శాశ్వతంగా వేరే ప్రాంతానికి బదిలీ, మరణం, ఒకటికంటే ఎక్కువ చోట్ల పేర్ల నమోదు వంటి కారణాలతో 73,39,235 పేర్లను తొలగించారు. ముసాయిదాలో కొనసాగిన ఓటర్లలో సుమారు 1.72 కోట్ల మందికి ఎలాంటి వ్యత్యాసాలు లేదా మ్యాపింగ్ గుర్తింపులు లేవని అధికారులు తెలిపారు.

**92 లక్షల మందికి నోటీసులు**

తదుపరి పరిశీలన అవసరమైన 92,88,187 కేసులను గుర్తించారు. అక్టోబర్ 8 నాటికి జారీ చేసిన 92.88 లక్షల నోటీసుల్లో 92.23 లక్షల నోటీసులను పంపిణీ చేశారు. వీటిలో ఇప్పటివరకు 82,11,205 కేసుల విచారణ పూర్తయింది. వాటిలో 74,62,851 కేసులను తుది జాబితాలో చేర్చేందుకు అర్హమైనవిగా గుర్తించారు. మరో 18,12,237 కేసులపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. క్లెయిమ్‌లు, అభ్యంతరాల దాఖలుకు అక్టోబర్ 7తో గడువు ముగిసింది. అయితే నోటీసుల జారీ, పెండింగ్ కేసుల పరిష్కార ప్రక్రియ నవంబర్ 5 వరకు కొనసాగనుంది. తుది ఓటర్ల జాబితాను నవంబర్ 9న ప్రచురించేందుకు ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించింది.

**ఫామ్ 7 దరఖాస్తులతో వివాదం**

తెలంగాణలో ........(తరువాయి 2లో)

## పట్టభద్రుల బరిలో బీజేపీ బీసీ అస్త్రం

### సుందర్‌రాజ్ వైపు అధిష్ఠానం చూపు!

- నల్లగొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా నిలిపేందుకు కసరత్తు
- వరంగల్, రాష్ట్రస్థాయి నేతలతో సుందర్‌రాజ్ భేటీలు
- బీసీ ఉద్యమ నేపథ్యం.. సామాజిక సమీకరణాలపై కమలం గురి
- గతంలో రెండుసార్లు చేజారిన ఎమ్మెల్సీ అవకాశాలు
- టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్వతంత్రంగా పోటీ చేసిన అనుభవం
- కుడా చైర్మన్‌గా పనిచేసిన గుర్తింపు.. విద్యావర్గాల్లో పరిచయాలు



కాకతీయ, తెలంగాణ బ్యూరో : నల్లగొండ-ఖమ్మం-వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీ నాయకుడు సంగంరెడ్డి సుందర్‌రాజ్ యాదవ్‌ను బరిలోకి దింపే అంశంపై బీజేపీలో కసరత్తు సాగుతోంది. బీసీ ఉద్యమ నాయకుడిగా గుర్తింపు, గతంలో కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ చైర్మన్‌గా పనిచేసిన అనుభవం, పట్టభద్రుల వర్గాలతో పరిచయాలు ఆయనకు ప్రత్యేక గుర్తింపునిచ్చాయి. ఈ నేపథ్యంలో సుందర్‌రాజ్ యాదవ్ అభ్యర్థిత్వంపై వరంగల్ ప్రాంతంతోపాటు రాష్ట్రస్థాయి బీజేపీ నాయకుల మధ్య సంప్రదింపులు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. అయితే పార్టీ అధికారికంగా అభ్యర్థిని ప్రకటించాల్సి ఉంది. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో సామాజిక సమీకరణాలు, అభ్యర్థి నేపథ్యం, పార్టీ బలాబలాలు కీలక అంశాలుగా నిలుస్తాయి. బీసీ ఉద్యమాల్లో చురుకుగా వ్యవహరించిన సుందర్‌రాజ్ యాదవ్‌కు అవకాశం కల్పిస్తే ఆ సామాజిక వర్గానికి రాజకీయ ప్రాతినిధ్యం కల్పించినట్లవుతుంది. బీసీ వర్గాల్లో ఆయనకున్న పరిచయాలు, ఉద్యమ నేపథ్యం పార్టీ అభ్యర్థి ఎంపికలో పరిగణనలోకి తీసుకోవాల్సిన అంశాలుగా నిలుస్తున్నాయి.

**రాష్ట్రస్థాయి నేతలతో సంప్రదింపులు**

సుందర్‌రాజ్ యాదవ్ అభ్యర్థిత్వం చుట్టూ బీజేపీ నాయకులతో ఆయనకు ఉన్న సంబంధాలు,

........(తరువాయి 2లో)

## కేరళ మాజీ సీఎం విజయన్‌కు హైకోర్టులో షాక్!

- కుమార్తె సంస్థ చెల్లింపులపై ఎఫ్ఐఆర్‌కు ఆదేశం
- వీణా, భర్త మహమ్మద్ రియాస్ పేర్లూ ప్రస్తావనలోకి
- రూ.1.72 కోట్ల చెల్లింపులపై అవినీతి ఆరోపణలు
- ప్రాథమిక విచారణతో సరిపెట్టిన రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయానికి ఎదురుదెబ్బ
- ఎస్ఎఫ్ఐఓ అంచనా ప్రకారం సంస్థకు రూ.2.73 కోట్లు



**కాకతీయ, నేషనల్ డెస్క్** : కుమార్తె వీణాకు చెందిన సంస్థకు అక్రమ చెల్లింపులు జరిగాయన్న ఆరోపణలపై కేరళ మాజీ సీఎం, సీపీఎం సీనియర్ నేత పినరయి విజయన్‌కు హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఈ వ్యవహారంలో విజయన్, ఆయన కుమార్తె వీణా, ఆమె భర్త, మాజీ మంత్రి మహమ్మద్ రియాస్ తదితరులపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కేరళ హైకోర్టు ఆదేశించింది. జస్టిస్ బదరుద్దీన్ నేతృత్వంలోని ఏకసభ్య ధర్మాసనం రాష్ట్ర విజిలెన్స్, అవినీతి నిరోధక విభాగాలకు ఈ మేరకు

........(తరువాయి 2లో)

- 12న మంత్రులతో సీఎం రేవంత్ కీలక భేటీ
- సాధారణం కంటే 17 శాతం తక్కువ వర్షపాతం
- 235 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు
- రైతులకు ఆర్థిక సాయం.. కరువు మండలాల గుర్తింపుపై కసరత్తు
- రూ.20 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీకి కేంద్రానికి విజ్ఞప్తి
- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



## వర్షాభావంపై సర్కారు అలర్ట్!

**కాకతీయ, తెలంగాణ బ్యూరో** : రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు తీవ్రతరం కాకముందే అప్రమత్తమై రైతులకు అండగా నిలవాలని సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది. సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదవడం, పలు మండలాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో వ్యవసాయ రంగంపై పడుతున్న ప్రభావాన్ని సమగ్రంగా సమీక్షించేందుకు ఈనెల 12న మంత్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. సాగునీటి లభ్యత, తాగునీటి సరఫరా, విద్యుత్ అవసరాలు, పంటల సాగు పరిస్థితులు, రైతులకు ఆర్థిక సాయం, కరువు ప్రభావిత మండలాల

........(తరువాయి 2లో)

# జెండా పాటకే పరిమితమా..?!

- జెండా పాట ధరకు.. రైతుకు చేరేదెంత?
- తక్‌పట్టీ నుంచి వేమెంట్ వరకు లొసుగులపై ఆరా
- యాక్షన్, బిడ్డింగ్ రిజిస్టర్ల నిర్వహణ నిలిపివేత
- ప్రతి లావాదేవీ ఆన్‌లైన్‌లో నమోదయ్యేలా కొత్త సాఫ్ట్‌వేర్
- గన్నీ బ్యాగుల విలువపైనా కమీషన్ వసూలు చేసినట్లు గుర్తింపు
- ఆగస్టు తనిఖీ నివేదికలు రద్దు.. లోతైన పరిశీలనకు ఆదేశాలు
- వారంలోగా టెండర్ ప్రక్రియకు సన్నాహాలు
- మార్కెటింగ్ శాఖ అడిషనల్ డైరెక్టర్ లక్ష్మణుడు





**కాకతీయ, వరంగల్ ప్రతినిధి :** జెండా పాటలో ఖరీదుదారు పాడిన ధరకు, రైతు చేతికి అందుతున్న చెల్లింపునకు మధ్య తేడా ఎక్కడ వస్తోంది? తక్‌పట్టీ నుంచి వేమెంట్ వరకు ఏ దశలో లొసుగులు చోటుచేసుకుంటున్నాయి? ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో మార్కెటింగ్ శాఖ తనిఖీల ప్రధాన లక్ష్యం ఇదేనని ఆ శాఖ అడిషనల్ డైరెక్టర్ లక్ష్మణుడు స్పష్టం చేశారు. జెండా పాట ధర, కమీషన్ ఏజెంట్ గుమాస్తా నమోదు చేసే ధర, రైతుకు చెల్లించే మొత్తం సరిపోలుతున్నాయా లేదా అన్నదానిపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తున్నామని 'కాకతీయ'కు వివరించారు. 2021 నుంచి మార్కెట్‌లో యాక్షన్ రిజిస్టర్ నిర్వహణ నిలిచిపోయిందని, బిడ్డింగ్ రిజిస్టర్లను కూడా మూసివేశారని లక్ష్మణుడు వెల్లడించారు. దీంతో లావాదేవీలను వెనక్కి వెళ్లి పరిశీలించడం, ధరల నమోదును సరిపోల్చడం వంటి అంశాల్లో పారదర్శకతకు విఘాతం కలిగే పరిస్థితి ఏర్పడిందని వివరించారు. జెండా పాట నుంచి తక్‌పట్టీ జారీ వరకు, మార్కెట్ యార్డు నుంచి లాట్ ఐడీ నమోదు వరకు ప్రతి దశనూ పరిశీలిస్తున్నట్లు చెప్పారు.

**ఆన్‌లైన్ రికార్డులతో లావాదేవీల తనిఖీ**

ఈనామ్ విధానంలో టెండర్ ప్రక్రియ ద్వారా నమోదైన ధరకు అనుగుణంగా తక్‌పట్టీ జారీ అయిందా లేదా అనేది ఆన్‌లైన్ రికార్డులతో ధ్రువీకరించవచ్చని లక్ష్మణుడు తెలిపారు. తక్‌పట్టీ రికార్డు అందుబాటులో లేకపోయినా ఆన్‌లైన్ వివరాల ఆధారంగా తనిఖీ చేయవచ్చని, పొరపాట్లు గుర్తిస్తే సరిదిద్దుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. గత ఏడాది మిర్చి సీజన్‌లో కఠినంగా వ్యవహరించడం వల్ల అంతకుముందు ఏడాదితో పోలిస్తే రూ.5 కోట్ల అదనపు ఆదాయం సమకూరిందని, మార్కెట్ ఆదాయం పెంపునకు ఇంకా అవకాశం ఉందని పేర్కొన్నారు.

గత ఆగస్టులో రెండు బృందాలు తనిఖీలు చేసినప్పటికీ, వాటి నివేదికల్లో లోతైన విశ్లేషణ లేదని లక్ష్మణుడు వివరించారు. సాధారణ పరిశీలనలకే పరిమితమైన నివేదికలను ప్రభుత్వం రద్దు చేసి, సంబంధిత అంశాలపై అవగాహన ఉన్న సీనియర్ అధికారులు స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ఆదేశించినట్లు తెలిపారు. కొత్త సాఫ్ట్‌వేర్ రూపకల్పనకు అవసరమైన లోపాలను గుర్తించడమే ప్రస్తుత తనిఖీల ఉద్దేశమని చెప్పారు. ఇందులో భాగంగా ఖమ్మం, వరంగల్‌తోపాటు రాష్ట్రంలోని మరో 10 ప్రధాన మార్కెట్లలోనూ పరిశీలనలు కొనసాగుతున్నాయని వెల్లడించారు.

**ప్రతి లావాదేవీ ఆన్‌లైన్‌లోకి**

మార్కెట్‌లో సిబ్బంది కొరత, రికార్డుల నిర్వహణలో ఇబ్బందుల నేపథ్యంలో జెండా పాట నుంచి తక్‌పట్టీ వరకు, వేమెంట్ నుంచి గేట్ ఎంట్రీ వరకు అన్ని ట్రేడింగ్ కార్యకలాపాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే సమగ్ర సాఫ్ట్‌వేర్‌ను తీసుకురావాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని లక్ష్మణుడు తెలిపారు. ఖరీదుదారు పాడిన ధర, కమీషన్ ఏజెంట్ గుమాస్తా నమోదు చేసిన ధర, రైతుకు చెల్లించిన మొత్తం ఒకదానితో ఒకటి సరిపోలేలా వ్యవస్థను రూపొందించనున్నట్లు చెప్పారు. తనిఖీల్లో గన్నీ బ్యాగుల విలువపైనా కమీషన్ వసూలు చేసినట్లు తమ పరిశీలనలో గుర్తించామని లక్ష్మణుడు వెల్లడించారు. ఇలాంటి వ్యత్యాసాలు, అదనపు వసూళ్లకు అవకాశం లేకుండా ప్రతి లావాదేవీని డిజిటల్ విధానంలో నమోదు చేసి, పరిశీలించగలిగేలా సాఫ్ట్‌వేర్‌ను రూపొందించడమే లక్ష్యమని చెప్పారు. వారం నుంచి 15 రోజుల్లో టెండర్ ప్రక్రియ చేపట్టేందుకు సన్నాహాలు చేస్తున్నామని, అప్పటివరకు తనిఖీలు కొనసాగుతాయని, రోజువారీ స్థితిగతుల నివేదికను మార్కెటింగ్ శాఖ డైరెక్టర్‌కు అందజేస్తామని తెలిపారు. గురువారం ఏనుమాముల మార్కెట్‌ను సందర్శించిన లక్ష్మణుడు పత్తి, అపరాల యార్డుల్లో జెండా పాట జరుగుతున్న సమయంలో సరుకులను పరిశీలించారు. మార్కెట్‌లోని ఆసుపత్రిని కూడా తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్‌పర్సన్ పులి ప్రియాంక అనిల్, కార్యదర్శి శ్రీనివాస్, ఏఎస్‌లు రాజేందర్, అశోక్, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బి. రవీందర్‌రెడ్డి, వ్యాపారులు లింగారెడ్డి, వేద ప్రకాష్, కాటన్ సెక్షన్ అధ్యక్షుడు వీరారావు, నాగభూషణం, రైతులు పాల్గొన్నారు.

# వర్షాభావంపై సర్కారు అలర్ట్!

**(మొదటిపేజీ తరువాయి)**

గుర్తింపు వంటి అంశాలు ఈ సమావేశంలో ప్రధానంగా చర్చకు రానున్నాయి. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వ సహకారాన్ని కోరిన రాష్ట్ర ప్రభుత్వం, వర్షాభావాన్ని ఎదుర్కొనేందుకు రూ.20 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీని ప్రతిపాదించింది. రాష్ట్రంలో సాధారణ వర్షపాతంతో పోలిస్తే సుమారు 17 శాతం తక్కువ వర్షాలు నమోదైనట్లు అంచనా వేస్తున్నారు. దాదాపు 235 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నట్లు అధికారులు గుర్తించారు. వర్షాలు ఆశించిన స్థాయిలో కురవకపోవడం వ్యవసాయ కార్యకలాపాలపై ప్రభావం చూపుతోంది. పంటల సాగు, భూముల్లో తేమ, నీటి లభ్యత వంటి అంశాలపై పరిస్థితిని అంచనా వేయాల్సిన అవసరం ఏర్పడింది. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తగ్గాయన్న అంచనాల నేపథ్యంలో రాబోయే రోజుల్లో పరిస్థితులు ఎలా మారతాయనే అంశంపైనా ప్రభుత్వం దృష్టి సారించింది. వర్షాభావం ఎదుర్కొంటున్న ప్రాంతాలను గుర్తించి, అక్కడి రైతులకు అవసరమైన సహాయాన్ని అందించేందుకు కార్యాచరణ రూపొందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి సమీక్ష చేపట్టనున్నారు.

**సాగునీటి లభ్యతపై ప్రత్యేక దృష్టి**

వర్షాలు తక్కువగా కురిసిన ప్రాంతాల్లో పంటల సాగుకు అవసరమైన నీరు అందుబాటులో ఉందా లేదా అనే అంశాన్ని ప్రభుత్వం పరిశీలించనుంది. సాగునీటి ప్రాజెక్టుల్లో ప్రస్తుతం ఉన్న నీటి నిల్వలు, వాటి ఆధారంగా వ్యవసాయానికి నీటిని అందించే పరిస్థితులు, రానున్న రోజుల్లో నీటి అవసరాలు వంటి అంశాలపై చర్చించనున్నారు. వర్షాభావం కొనసాగితే పంటలకు నీటి కొరత ఏర్పడకుండా ఎలాంటి ముందస్తు చర్యలు తీసుకోవాలనే అంశంపై నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ రంగానికి అవసరమైన ప్రణాళికను సిద్ధం చేయడంపై సమావేశంలో దృష్టి సారించనున్నారు. వర్షాభావ పరిస్థితులు వ్యవసాయ రంగానికే పరిమితం కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరా, విద్యుత్ వినియోగంపైనా ప్రభావం చూపే అవకాశం ఉండటంతో ప్రభుత్వం ఈ అంశాలను కూడా సమీక్షించనుంది. గ్రామాల్లో తాగునీటి అవసరాలు, అందుబాటులో ఉన్న నీటి వనరులు, అవసరమైన చోట ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై చర్చించనున్నారు. వ్యవసాయ అవసరాల నేపథ్యంలో విద్యుత్ వినియోగం పెరిగితే సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలను పరిశీలించనున్నారు. పరిస్థితి మరింత తీవ్రతరం కాకముందే సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేసేలా కార్యాచరణ రూపొందించడంపై ముఖ్యమంత్రి దృష్టి పెట్టనున్నారు.

**రైతులకు ఆర్థిక సాయం.. కరువు మండలాల గుర్తింపు**

వర్షాభావంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు ఆర్థికంగా అండగా నిలవడం ప్రభుత్వ ముందున్న ప్రధాన అంశాల్లో ఒకటి. పంటల సాగుపై ప్రభావం పడిన ప్రాంతాలను గుర్తించి, నష్ట తీవ్రతను అంచనా వేసి సహాయక చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. ఈ క్రమంలో కరువు ప్రభావిత మండలాల గుర్తింపు, బాధిత రైతులకు ఆర్థిక సాయం అందించే విధానం, కేంద్రం నుంచి పొందాల్సిన సహకారంపై సమావేశంలో చర్చించనున్నారు. వర్షాభావ పరిస్థితులపై ఇప్పటికే జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలోనూ చర్చ జరిగినట్లు సమాచారం. క్షేత్రస్థాయిలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిగణనలోకి తీసుకుని సహాయక చర్యలను ఖరారు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రత్యేక ఆర్థిక సహాయం అందించాలని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే కేంద్రాన్ని కోరింది. ఇందుకోసం రూ.20 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీ కేటాయించాలని విజ్ఞప్తి చేసింది. కరువు ప్రభావిత మండలాలను గుర్తించి ప్రకటించడం, బాధిత రైతులకు తగిన సహాయం అందించడం వంటి అంశాల్లో కేంద్ర సహకారం కోరుతూ అసెంబ్లీలో తీర్మానం చేసినట్లు పేర్కొంది. కేంద్రం నుంచి అందే సహాయం, రాష్ట్ర ప్రభుత్వం తక్షణంగా చేపట్టాల్సిన చర్యలపై తదుపరి నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి మంత్రులతో నిర్వహించనున్న సమావేశం ప్రాధాన్యం సంతరించుకుంది.

**మంత్రివర్గ ఉపసంఘం ప్రణాళికల పరిశీలన**

వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు మంత్రివర్గ ఉపసంఘం రూపొందించిన ప్రణాళికలను కూడా ముఖ్యమంత్రి పరిశీలించనున్నారు. వివిధ శాఖల వద్ద ఉన్న సమాచారం, క్షేత్రస్థాయి పరిస్థితులు, రైతులకు ఎదురవుతున్న ఇబ్బందులను సమన్వయంగా పరిశీలించి తదుపరి చర్యలను నిర్ణయించాల్సి ఉంది. వర్షాభావం మరింత తీవ్రమైతే వ్యవసాయం, తాగునీటి సరఫరా, విద్యుత్ అవసరాలపై పడే ప్రభావాన్ని ముందుగానే అంచనా వేయడం ఈ సమీక్షలో కీలకం కానుంది. వర్షాభావంపై త్వరలో అఖిలపక్ష సమావేశం నిర్వహించడంతో పాటు రైతు సంఘాలు, వ్యవసాయ రంగ నిపుణులు, సంబంధిత వర్గాల నుంచి సలహాలు, సూచనలు తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. వివిధ వర్గాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని క్షేత్రస్థాయిలో రైతులకు ఉపయోగపడే చర్యలను ఖరారు చేయాలని యోచిస్తోంది. ఈనెల 12న మంత్రులతో జరిగే సమావేశంలో వర్షాభావ ప్రాంతాల పరిస్థితి, రైతులకు అందించాల్సిన సహాయం, నీటి నిర్వహణ, విద్యుత్ సరఫరా వంటి అంశాలపై సమీక్ష జరగనుంది. అనంతరం ప్రభుత్వం ప్రకటించే నిర్ణయాలు, వాటి అమలు విధానం తెలంగాణ రైతులకు కీలకం కానున్నాయి.

# కేరళ మాజీ సీఎం విజయన్‌కు హైకోర్టులో షాక్!

**(మొదటిపేజీ తరువాయి)**

ఉత్తర్వులు జారీ చేసింది. వీణాకు చెందిన ఎక్సాలాజిక్ సొల్యూషన్స్ సంస్థకు కొచ్చి మినరల్స్ అండ్ రూటైల్ లిమిటెడ్ నుంచి సాఫ్ట్‌వేర్, కన్సల్టెన్సీ సేవల పేరుతో 201718, 201819 ఆర్థిక సంవత్సరాల్లో సుమారు రూ.1.72 కోట్లు చెల్లించినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ వ్యవహారంపై 2023లో ఆదాయపు పన్ను శాఖ అధికారులు సోదాలు నిర్వహించడంతో విషయం వెలుగులోకి వచ్చింది. అనంతరం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీస్ దర్యాప్తు చేపట్టాయి. ఎక్సాలాజిక్ సంస్థ మొత్తం రూ.2.73 కోట్లు పొందినట్లు ఎస్ఎఫ్ఐఓ అంచనా వేసింది.

**ప్రాథమిక విచారణపై సవాల్**

ఈ కేసులో విజయన్, వీణా, రియాస్ తదితరులపై అవినీతి నిరోధక చట్టం కింద ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని తొలుత ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సిఫార్సు చేసినట్లు సమాచారం. అయితే రాష్ట్ర ప్రభుత్వం నేరుగా ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండా రాష్ట్ర క్రైమ్ బ్రాంచ్‌తో ప్రాథమిక విచారణకు ఆదేశించింది. ఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ మాజీ సీఎం వీఎస్ అచ్యుతానందన్ వద్ద అదనపు ప్రైవేట్ కార్యదర్శిగా పనిచేసిన కేఎం షాజహాన్ హైకోర్టును ఆశ్రయించారు. పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఆదేశించింది. వీణా, ఎక్సాలాజిక్ సంస్థ ఎలాంటి తప్పు చేయలేదని సీపీఎం వాదిస్తోంది. సదరు చెల్లింపులు చట్టబద్ధమైన వ్యాపార ఒప్పందాల్లో భాగమేనని పేర్కొంది. రాజకీయ ప్రేరణతోనే ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సోదాలు నిర్వహించిందని ఆరోపించింది. అయితే హైకోర్టు తాజా ఆదేశాలతో ఈ వ్యవహారంలో తదుపరి దర్యాప్తుపై ఆసక్తి నెలకొంది.

**లావలిన్ కేసులోనూ గతంలో విచారణ**

విజయన్ గతంలో విద్యుత్ మంత్రిగా ఉన్న సమయంలో తీసుకున్న నిర్ణయాలకు సంబంధించి ఎస్ఎన్‌సీ లావలిన్ కేసులోనూ సీబీఐ దర్యాప్తు జరిగింది. 199597 మధ్య కేరళలో జలవిద్యుత్ ప్రాజెక్టుల ఆధునికీకరణ కోసం కెనడాకు చెందిన ఎస్ఎన్‌సీ లావలిన్ సంస్థతో ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం వల్ల రాష్ట్ర ఖజానాకు రూ.374.50 కోట్ల నష్టం వాటిల్లిందన్న అభియోగాల నేపథ్యంలో విజయన్ పేరు కేసులో ప్రస్తావనకు వచ్చింది.

# 74 లక్షల ఓటర్లకు గ్రీన్‌సిగ్నల్!

**(మొదటిపేజీ తరువాయి)**

ఓటర్ల తొలగింపు ప్రక్రియపై గతంలో పలు వివాదాలు తలెత్తాయి. ఫామ్ 7 ద్వారా భారీ సంఖ్యలో ఓట్ల తొలగింపునకు దరఖాస్తులు రావడం, కొన్ని చోట్ల అక్రమ దరఖాస్తుల వ్యవహారంలో కేసుల నమోదు వరకు పరిణామాలు వెళ్లడం చర్చనీయాంశమైంది. ఈ నేపథ్యంలో విచారణలు, అభ్యంతరాల పరిశీలన అనంతరం లక్షలాది మంది ఓటర్లను తుది జాబితాలో చేర్చేందుకు ఆమోదం లభించడం ప్రాధాన్యం సంతరించుకుంది. తుది జాబితా ప్రచురణకు ముందుగా పెండింగ్ కేసుల పరిష్కారం కీలకం కానుంది. మిగిలిన కేసులపై ఎన్నికల సంఘం తీసుకునే నిర్ణయాలతో ఓటర్ల సంఖ్యలో మరిన్ని మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉంది.

# నెల రోజుల్లో జీవో 59 దరఖాస్తులకు పరిష్కారం

- 500 గజాల లోపు పెండింగ్ దరఖాస్తులపై ప్రభుత్వ నిర్ణయం
- పారదర్శకంగా క్రమబద్ధీకరణ ప్రక్రియ
- రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**కాకతీయ, హైదరాబాద్ :** జీవో 59 కింద స్థలాల క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి సత్వర న్యాయం అందిస్తామని రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. 500 చదరపు గజాల లోపు ఉన్న పెండింగ్ దరఖాస్తులన్నింటినీ రాబోయే నెల రోజుల్లోగా పరిష్కరిస్తామని వెల్లడించారు. ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మెమో నంబర్ 48030 ద్వారా సంబంధిత జిల్లాల కలెక్టర్లకు ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ స్థలాల్లో నివాసాలు ఏర్పాటు చేసుకున్నవారి స్థలాలను క్రమబద్ధీకరించేందుకు తీసుకొచ్చిన జీవో 59 అమలులో ఎలాంటి అక్రమాలకు తావివ్వకూడదని మంత్రి స్పష్టం చేశారు. గతంలో ఈ జీవో అమలు సమయంలో జరిగిన పొరపాట్లు, అక్రమాలు పునరావృతం కాకుండా అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రతి నిర్ణయం నిబంధనలకు అనుగుణంగానే ఉండాలని ఆదేశించారు. కన్వేయన్స్ డీడ్స్‌కు సంబంధించి పెండింగ్‌లో ఉన్న కేసులను కూడా సమగ్రంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు మంత్రి మార్గదర్శకాలు ఇచ్చారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సత్వరమే న్యాయం జరిగేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. క్రమబద్ధీకరణ ప్రక్రియలో పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు.

# పట్టభద్రుల బరిలో బీజేపీ బీసీ అస్త్రం

**(మొదటిపేజీ తరువాయి)**

జరిగిన భేటీలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. వరంగల్ ప్రాంత నాయకులతో పాటు రాష్ట్రస్థాయి నేతలతోనూ ఆయన సంప్రదింపులు జరిపిన అంశం రాజకీయంగా ఆసక్తి రేకెత్తిస్తోంది. ఈ పరిణామాల నేపథ్యంలో పార్టీ నాయకత్వం అభ్యర్థుల ఎంపికలో ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్నది కీలకంగా మారింది. 2015, 2021 పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భాల్లోనూ సుందర్‌రాజ్ యాదవ్ పేరు ప్రస్తావనకు వచ్చినట్లు గతంలో కథనాలు వెలువడ్డాయి. ఆ ఎన్నికల్లో ఆయనకు అవకాశం దక్కలేదనే అంశం ప్రస్తుత అభ్యర్థిత్వ చర్చకు నేపథ్యంగా నిలుస్తోంది. 2025లో జరిగిన టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో సుందర్‌రాజ్ యాదవ్ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి 2,040 ప్రాధాన్య ఓట్లు సాధించారు. ఈ పోటీ ఆయనకు ఎన్నికల ప్రక్రియ, ప్రచార నిర్వహణ, ఓటర్లను చేరుకునే విషయంలో అనుభవాన్ని అందించింది. ఉపాధ్యాయ, విద్యావర్గాల్లో ఏర్పడిన పరిచయాలు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంలోనూ ప్రస్తావనకు వస్తున్నాయి. కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ చైర్మన్‌గా పనిచేసిన సుందర్‌రాజ్ యాదవ్‌కు పరిపాలనా అనుభవం ఉంది. ఆ హోదాలో ఏర్పడిన పరిచయాలు, బీసీ సంఘాల్లో ఆయనకు ఉన్న గుర్తింపు ఆయన రాజకీయ ప్రస్థానంలో కీలకమైన అంశాలు. అయితే ఎమ్మెల్సీ అభ్యర్థిత్వం ఖరారైతే పార్టీ యంత్రాంగం, స్థానిక నాయకుల సమన్వయం, పట్టభద్రుల ఓటర్లతో సంబంధాలపై ఆయన ప్రచార వ్యూహం ఆధారపడుతుంది.

# గుమాస్తా సంఘం అధ్యక్షుడిగా చుంచు జగదీశ్వర్

**కాకతీయ, వరంగల్ ప్రతినిధి :** వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లోని గుమాస్తాల సంఘం నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏనుమాముల మార్కెట్‌లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా చుంచు జగదీశ్వర్, ఉపాధ్యక్షుడిగా బండి చందర్, ప్రధాన కార్యదర్శిగా వంగరి వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శిగా సింగిరెడ్డి రమేష్, కోశాధికారిగా గోరంట్ల శ్రవణ్‌కుమార్ ఎన్నికయ్యారు. కన్వీనర్ కె. మల్లికార్జున్, పెసరి కుమారస్వామి, మామిడాల శ్యామ్, ఏ. బాబు, మిట్టపల్లి హరినాథ్ సమక్షంలో ఎన్నికల ప్రక్రియ నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.

# నేడు ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో మంత్రి పొంగులేటి పర్యటన

**కాకతీయ, ఖమ్మం :** రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శనివారం ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో పర్యటించనున్నారు. ఉదయం 10.45 గంటలకు ఖమ్మం రూరల్ మండలం పోలేపల్లిలో బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. 11.15 గంటలకు ఖమ్మం నగరంలోని ఎస్ఆర్ కన్వెన్షన్‌లో ఖమ్మం-నల్గొండ-వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో పాల్గొంటారు. సాయంత్రం 5 గంటలకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో రోడ్డు విస్తరణ, సెంట్రల్ లైటింగ్, డ్రెయిన్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తారు. అనంతరం సాయంత్రం 5.20 గంటలకు అశ్వారావుపేట మినీ స్టేడియంలో రాష్ట్రస్థాయి అండర్-20 బాలికల కబడ్డీ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తారు. ఈ వివరాలను మంత్రి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

# కేసీఆర్ పదేళ్ల పాలనపై అసత్య ప్రచారాలెందుకు?



**కాకతీయ, నిజామాబాద్:** కేసీఆర్ నేతృత్వంలో తెలంగాణలో పదేళ్లపాటు సాగిన పాలనపై కాంగ్రెస్ ప్రభుత్వం అసత్య ప్రచారాలు మానుకోవాలని, తన వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులపై బురదజల్లుతోందని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి విమర్శించారు. పరిపాలనా వికేంద్రీకరణతో సంక్షేమ పథకాలను గడపగడపకూ చేర్చిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. బొగ్గు కొరతతో విద్యుదుత్పత్తికి ఆటంకాలు, ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎదురవుతున్న ఇబ్బందులు కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలకు నిదర్శనమని మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి కుటుంబ ఆస్తులపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించేందుకు సిద్ధమా అని ప్రశ్నించారు.

**10 జిల్లాల నుంచి 33 జిల్లాలకు**

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేసీఆర్ ప్రభుత్వం పరిపాలనలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిందని వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ప్రజలకు పరిపాలన అందుబాటులో లేకపోవడంతో 10 జిల్లాల తెలంగాణను 33 జిల్లాలుగా విస్తరించారని, 140కి పైగా కొత్త మండలాలు, 27 రెవెన్యూ డివిజన్లు ఏర్పాటు చేశారని వివరించారు. కలెక్టరేట్లు, మండల కేంద్రాలు ప్రజలకు చేరువ కావడంతో పింఛన్లు, రైతుబంధు, కల్యాణలక్ష్మి వంటి పథకాలు ప్రజలకు అందాయని పేర్కొన్నారు. తెలంగాణ సాధన కోసం 14-15 ఏళ్లపాటు ఉద్యమం సాగించి, సమాజాన్ని ఏకతాటిపైకి తెచ్చిన కేసీఆర్ అపర చాణక్యుడని కొనియాడారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ముందస్తు ప్రణాళిక లేకపోవడంతో రాష్ట్రంలో విద్యుత్ సంక్షోభ పరిస్థితులు ఏర్పడ్డాయని వేముల విమర్శించారు. కొత్తగూడెంలో 800 మెగావాట్లు, భద్రాద్రిలో 540 మెగావాట్లు, యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలో 3,400 మెగావాట్ల సామర్థ్యానికి సంబంధించి ఉత్పత్తిపై ప్రభావం పడిందని తెలిపారు. యాదాద్రిలో 4,000 మెగావాట్ల సామర్థ్యానికి గాను 600 మెగావాట్లే ఉత్పత్తి అవుతోందని, మొత్తంగా దాదాపు 5,000 మెగావాట్ల విద్యుదుత్పత్తికి ఆటంకం ఏర్పడిందని ఆరోపించారు. విద్యుత్ కోతలతో ప్రజలు, సాగునీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.

**రేవంత్ కుటుంబ ఆస్తులపై విచారణకు సిద్ధమా?**

సీఎం రేవంత్‌రెడ్డి కుటుంబ ఆస్తులపై వేముల ప్రశాంత్‌రెడ్డి ప్రశ్నలు సంధించారు. రేవంత్‌రెడ్డి భార్య పేరిట ఉన్నట్లు తాను పేర్కొన్న హ్యుందాయ్ షోరూమ్‌ల విలువ సుమారు రూ.6,000 కోట్లు ఎలా వచ్చిందో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆయన సోదరుడు రూ.1,000 కోట్ల పెట్టుబడితో ఏరోస్పేస్ విడిభాగాల పరిశ్రమను ఎలా స్థాపించారని, సుమారు 50 అంతర్జాతీయ పాఠశాలల ఏర్పాటుకు నిధులు ఎక్కడి నుంచి వచ్చాయని ప్రశ్నించారు. రూ.200 కోట్ల నష్టాల్లో ఉన్నట్లు పేర్కొన్న మెడికవర్ ఆసుపత్రి వాటాలను రెండున్నరేళ్లలో రూ.13,200 కోట్లకు ఎలా విక్రయించగలిగారని నిలదీశారు. ఇవి వేముల చేసిన ఆరోపణలుగా పేర్కొంటూ, బీఆర్ఎస్ నేతలతో పాటు సీఎం కుటుంబ ఆస్తులపైనా సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

**80 శాతం స్థానాల్లో బీఆర్ఎస్ గెలుస్తుంది**

కాంగ్రెస్, బీజేపీలు నిర్వహించినట్లు తాను పేర్కొన్న అంతర్గత సర్వేల్లో బీఆర్ఎస్‌కు 70-80 శాతం స్థానాలు వస్తాయని వెల్లడైందని, పార్టీ తిరిగి అధికారంలోకి రావడం ఖాయమని వేముల ధీమా వ్యక్తం చేశారు. అయితే సర్వేలకు సంబంధించిన వివరాలను వెల్లడించలేదు. పోలీసుల వేధింపులు, అక్రమ కేసులతో ప్రజాస్వామ్య నిరసనలను అణచివేయలేరన్నారు. భీమ్‌గల్‌లో ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్తున్న తనను హైదరాబాద్‌లో అరెస్టు చేయడం దుర్మార్గమని విమర్శించారు. కార్యకర్తలు అధైర్యపడకుండా కేసీఆర్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను గ్రామగ్రామాన ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. నిజామాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో జిల్లా పార్టీ మాజీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉద్యమకారులు చారి (ఆర్మూర్), గట్టు ఈశ్వర్ (భీమ్‌గల్), రహీం (బాల్కొండ), గణేష్ గుప్తా (కమ్మర్‌పల్లి), జ్ఞానేశ్వర్ (వేల్పూర్)తో పాటు జిల్లా ఉద్యమకారులను సన్మానించారు. తెలంగాణ ఉద్యమంలో అమరులైన వారి కుటుంబ సభ్యులను గౌరవంగా సత్కరించి పాదాభివందనం చేశారు. అమరవీరుల కుటుంబాలకు, ఉద్యమకారులకు పార్టీ అండగా నిలవాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచించినట్లు తెలిపారు. మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, గణేష్ గుప్తా, విజి గౌడ్, విఠల్‌రావు, నీతు కిరణ్, బాజిరెడ్డి జగన్, నూడా మాజీ చైర్మన్ ప్రభాకర్‌తో పాటు జిల్లా నాయకులు, కార్యకర్తలు, అమరవీరుల కుటుంబ సభ్యులు, ఉద్యమ జేఏసీ నాయకులు పాల్గొన్నారు.



## తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ

**ప్రధానోపాధ్యాయురాలు కే. పద్మావతి**

**కాకతీయ, నెల్లికుదురు:** ప్రాథమికోన్నత పాఠశాల నరసింహుల గూడెంలో విద్యార్థినీ ,విద్యార్థులతో ఉపాధ్యాయులు ముందస్తు బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు బతుకమ్మలు పేర్చిన అనంతరం ఆట, పాటలతో ఉత్సాహంగా గడిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కే. పద్మావతి మాట్లాడుతూ తెలంగాణలో పూలను బతుకమ్మ గా పేర్చి పూజించడం , ప్రకృతిని దైవంగా భావించడం ఇక్కడి ప్రజల ప్రత్యేకత అలాగే తెలంగాణ ఆడపడుచులు అంతా కలిసి సంతోషంగా నిర్వహించుకునే వేడుక బతుకమ్మ అని, తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత రేపటి తరమైన నేటి విద్యార్థులుదని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినీ, విద్యార్థులతో పాటుగా ఉపాధ్యాయులు సిహెచ్. హరినాథ్, బి. శ్రీనివాస్, టి. సుకన్య, సిహెచ్ . రమేష్, ఎస్ .వీరేందర్, సంగ శ్రీనివాస్, ఎస్.కె.సయ్యద్, ఏ. మమత పాల్గొన్నారు.

## నేడు ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో మంత్రి పొంగులేటి పర్యటన

**కాకతీయ, ఖమ్మం :** రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శనివారం ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో పర్యటించనున్నారు. ఉదయం 10.45 గంటలకు ఖమ్మం రూరల్ మండలం పోలేపల్లిలో బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. 11.15 గంటలకు ఖమ్మం నగరంలోని ఎస్ఆర్ కన్వెన్షన్‌లో ఖమ్మం-నల్గొండ-వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో పాల్గొంటారు. సాయంత్రం 5 గంటలకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో రోడ్డు విస్తరణ, సెంట్రల్ లైటింగ్, డ్రెయిన్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తారు. అనంతరం సాయంత్రం 5.20 గంటలకు అశ్వారావుపేట మినీ స్టేడియంలో రాష్ట్రస్థాయి అండర్-20 బాలికల కబడ్డీ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తారు. ఈ వివరాలను మంత్రి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

## రాష్ట్రస్థాయి క్రీడలకు ఇనుగుర్తి విద్యార్థులు

- టెన్నిస్, గట్కా పోటీలకు ఐదుగురి ఎంపిక
- ఉమ్మడి వరంగల్ జిల్లా పోటీల్లో ప్రతిభ
- ఇనుగుర్తి జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం అమ్మ యాకయ్య




**కాకతీయ, ఇనుగుర్తి :** రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఇనుగుర్తి జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు ఎంపిక కావడం అభినందనీయమని పాఠశాల హెచ్ఎం అమ్మ యాకయ్య అన్నారు. శుక్రవారం ఫిజికల్ డైరెక్టర్ తాళ్ల ప్రణయ్‌తో కలిసి వివరాలు వెల్లడించారు. 70వ రాష్ట్రస్థాయి పాఠశాల క్రీడా సమాఖ్య పోటీల్లో భాగంగా ఇటీవల జేఎన్ఎస్ స్టేడియంలో నిర్వహించిన ఉమ్మడి వరంగల్ జిల్లా ఎంపిక పోటీల్లో విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు తెలిపారు. టెన్నిస్ అండర్ 17 విభాగంలో సంగేమ్ రాజు, మోరపోజు చైతన్య రిషి, అండర్ 14 విభాగంలో పార్నంది హర్షవర్ధన్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. గట్కా అండర్ 17 విభాగంలో జాటోత్ అజయ్, సాత్విక్ ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ నెల 11 నుంచి 13 వరకు హైదరాబాద్‌లోని జీహెచ్ఎంసీ ఇందిరా పార్క్‌లో అండర్ 14 టెన్నిస్ పోటీలు, మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లాలో గట్కా పోటీలు జరగనున్నాయి. అండర్ 17 టెన్నిస్ పోటీలు ఈ నెల 13 నుంచి 15 వరకు హనుమకొండలోని జేఎన్ఎస్ టెన్నిస్ కోర్టులో నిర్వహించనున్నారు. విద్యార్థులను హెచ్ఎం అమ్మ యాకయ్య, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

## ప్రభుత్వ పాఠశాలలో బతుకమ్మ వేడుకలు



**కాకతీయ, రుద్రంగి :** రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలం మానాల గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం సాయంత్రం ముందస్తు బతుకమ్మ వేడుకలు వైభవంగా నిర్వహించారు. విద్యార్థులు రంగురంగుల పూలతో ఆకర్షణీయంగా బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ వస్త్రధారణలో బతుకమ్మ పాటలు పాడుతూ ఉత్సాహంగా నృత్యాలు చేశారు. పాఠశాల ప్రాంగణం చిన్నారుల సందడితో పండుగ వాతావరణాన్ని తలపించింది. గ్రామ సర్పంచ్ బుర్ర శంకర్ పాల్గొని విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బుర్ర శంకర్,విడిసి వైస్ చైర్మన్ చెదలు నవీన్, ఉపాధ్యాయులు ,శ్రీధర్, నవీన్,హనుమండ్లు, స్వప్న, వెంకట లక్ష్మి, మానస, గౌతమి, వాణి, ప్రియాంక, మంజులతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

## పట్టభద్రుల ఓటరు నమోదు వేగవంతం చేయాలి

**టీపీసీసీ సభ్యుడు పెండెం రామానంద్ పిలుపు**

**కాకతీయ, నర్సంపేట టౌన్ :** పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేసి, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు అయ్యేలా చొరవ చూపాలని టీపీసీసీ సభ్యుడు పెండెం రామానంద్ కోరారు. నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ ఎన్నికల నర్సంపేట కాంగ్రెస్ కోఆర్డినేటర్ పబ్బతి సతీష్‌రెడ్డి, ప్రైవేట్ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు మెట్టు రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ప్రైవేట్ ఉపాధ్యాయుల సంఘం బాధ్యులకు సూచించారు. పట్టభద్రుల్లో ఓటరు నమోదుపై అవగాహన కల్పించి, అర్హులైన వారందరూ నమోదు చేసుకునేలా కృషి చేయాలని కోరారు. వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి రామిరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డికి మద్దతుగా నిలిచి, ఆయన విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికీ ఉచిత సహాయ పరికరాలు

- ఈ నెల 27, 28, 29 తేదీల్లో పంపిణీ
- 15వ తేదీలోపు లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేయాలి
- రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్



**కాకతీయ, హైదరాబాద్:** హుస్నాబాద్ నియోజకవర్గంలో అర్హులైన దివ్యాంగులు, వృద్ధులందరికీ ఉచిత సహాయ పరికరాలు అందించాలని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. ఈ నెల 15వ తేదీలోపు లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేసి, 27, 28, 29 తేదీల్లో భారత కృత్రిమ అవయవాల నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో ఏడిప్ పథకం కింద పరికరాలు పంపిణీ చేయాలని స్పష్టం చేశారు. గురువారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో పంపిణీ ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. వీల్‌చైర్లు, వినికిడి పరికరాలు, ట్రైసైకిళ్లు, నడక కర్రలు, కళ్లద్దాలు, కృత్రిమ అవయవాలను అర్హులకు అందించనున్నట్లు తెలిపారు. 80 శాతానికి పైగా వైకల్యం ఉన్న అర్హులకు బ్యాటరీతో నడిచే ట్రైసైకిళ్లు అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తల సమన్వయంతో అర్హులను గుర్తించి, దండోరా ద్వారా పథకంపై ప్రచారం చేయాలని సూచించారు. యూడీఐడీ కార్డు లేదా సదరం ధ్రువీకరణ పత్రం, రేషన్ కార్డు లేదా ఆదాయ ధ్రువీకరణ పత్రం, దివ్యాంగుల పింఛన్ కార్డు తదితర పత్రాలతో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

**మూడు జిల్లాల్లో పంపిణీ కేంద్రాలు**

హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ మండలాల వారికి హుస్నాబాద్‌లో, భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండలాల వారికి ముల్కనూరులో పంపిణీ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. చిగురుమామిడి, సైదాపూర్ మండలాల వారికి అందుబాటులో ప్రత్యేక కేంద్రం ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు. లబ్ధిదారులను ప్రత్యేక బస్సుల్లో తరలించడంతో పాటు భోజన, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. సమావేశంలో దివ్యాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్ సర్వేశ్వర్‌రెడ్డి, మూడు జిల్లాల అధికారులు, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ డిజేబిలిటీ రాంగోపాల్‌రెడ్డి, ఈడీపీ జాయింట్ మేనేజర్ రవిశంకర్, రవికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## మోడల్ స్కూల్‌లో మా బడి బతుకమ్మ



**కాకతీయ,శంకరపట్నం:** సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని శంకరపట్నం మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో శుక్రవారం 'మా బడి బతుకమ్మ' వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు రంగురంగుల పూలతో బతుకమ్మలను రూపొందించి, సంప్రదాయ పాటలు, ఆటపాటలతో పాఠశాల ప్రాంగణాన్ని పండుగ వాతావరణంతో నింపారు. పాఠశాల ప్రిన్సిపాల్ కే. ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరై దీపం వెలిగించి, కొబ్బరికాయ కొట్టి వేడుకలను ప్రారంభించారు. అనంతరం ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులు తరగతుల వారీగా రూపొందించిన బతుకమ్మలను పాఠశాల ప్రాంగణంలో అందంగా అలంకరించి ప్రదర్శించారు. వివిధ రకాల పూలతో తీర్చిదిద్దిన బతుకమ్మలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థులు బతుకమ్మ పాటలకు నృత్యాలు చేస్తూ ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కే. ప్రభాకర్ మాట్లాడుతూ, విద్యార్థులకు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పించడంతోపాటు వాటి విశిష్టతను భావితరాలకు అందించడంలో ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని అన్నారు. పాఠశాలలో సంప్రదాయబద్ధంగా బతుకమ్మ వేడుకలు నిర్వహించడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజు, సతీష్, శివశంకర్, ఆర్. రజిత, నాగమణి, ఎస్. రజిత, వనజ, రాధ, సంధ్య, రజిని, డా. మహేందర్ కట్కూరి, రమణారెడ్డి, మధుకర్, సంపత్, శంకర్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి

**ములుగు జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్ చిటమట రఘు విజ్ఞప్తి**

**కాకతీయ, ఏటూరునాగారం :** బతుకమ్మ, సద్దుల బతుకమ్మ, దసరా పండుగలను ప్రజలు సంతోషంగా, సురక్షితంగా జరుపుకునేలా పోలీసు, సంబంధిత శాఖల అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని ములుగు జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్ చిటమట రఘు కోరారు. పండుగల సందర్భంగా రహదారులపై రద్దీ పెరిగే అవకాశం ఉన్నందున ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని సూచించారు. తాడ్వాయిలో ఇటీవల జరిగిన లారీ ప్రమాదంలో సీఆర్‌పీఎఫ్ జవాన్ మరణించడం పట్ల విచారం వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని కోరారు. పండుగల కోసం ఇతర ప్రాంతాల్లో నివసిస్తున్న తెలంగాణ ప్రజలు స్వగ్రామాలకు చేరుకునే నేపథ్యంలో ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా భద్రతా ఏర్పాట్లు చేయాలన్నారు. ముఖ్యంగా ఇసుక లారీల వల్ల ప్రమాదాలు జరగకుండా దసరా వరకు వాటి రాకపోకలను నియంత్రించాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి మండల కేంద్రంలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించి, మద్యం సేవించి వాహనాలు నడిపేవారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. పండుగలు ముగిసే వరకు పోలీసులు ప్రజలకు రక్షణగా నిలిచి, ప్రయాణాలు సురక్షితంగా సాగేలా చర్యలు చేపట్టాలని చిటమట రఘు కోరారు.

## ఎయిడ్స్ నివారణలో వరంగల్‌కు జాతీయ గుర్తింపు

- హెచ్ఐవీ నియంత్రణలో 'సురక్షిత్' హోదా
- ఆరు నెలల్లో 'సురక్షిత్ ప్లస్' సాధించడమే లక్ష్యం
- వరంగల్ జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ రాజారెడ్డి




**కాకతీయ, వరంగల్ ప్రతినిధి :** హెచ్ఐవీ, ఎయిడ్స్ నియంత్రణ, నివారణ కార్యక్రమాల అమలులో వరంగల్ జిల్లా జాతీయస్థాయిలో గుర్తింపు పొందిందని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ రాజారెడ్డి తెలిపారు. జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో మెరుగైన పనితీరు కనబరిచిన జిల్లాలకు ఇటీవల ర్యాంకులు ప్రకటించగా వరంగల్‌కు 'సురక్షిత్' హోదా లభించిందన్నారు. కలెక్టర్ సత్యశారద మార్గదర్శకత్వంలో వైద్యారోగ్య శాఖ, సమగ్ర కౌన్సెలింగ్, పరీక్షా కేంద్రాలు, యాంటీ రెట్రోవైరల్ చికిత్స కేంద్రం, స్వచ్ఛంద సంస్థల సమన్వయంతో ఈ గుర్తింపు సాధించినట్లు పేర్కొన్నారు. వచ్చే ఆరు నెలల పాటు ఈ స్థాయిని కొనసాగిస్తూ 'సురక్షిత్ ప్లస్' హోదా సాధించడమే లక్ష్యంగా పనిచేస్తామని వెల్లడించారు.

**ఉచితంగా మందులు, పరీక్షలు**

హెచ్ఐవీ బాధితులకు ప్రభుత్వం ఉచితంగా యాంటీ రెట్రోవైరల్ మందులు, కౌన్సెలింగ్, సీడీ4, వైరల్ లోడ్ పరీక్షలు అందిస్తోందని రాజారెడ్డి తెలిపారు. హెచ్ఐవీని ముందుగా గుర్తించడం, చికిత్సను నిరంతరం కొనసాగించడం, వైరల్ లోడ్‌ను నియంత్రించడం, వివక్షను నిర్మూలించడం, ప్రజల్లో అవగాహన పెంచడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. ప్రజలు అపోహలను వీడి, అవసరమైనప్పుడు సమీప ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా పరీక్షలు చేయించుకుని సకాలంలో చికిత్స పొందాలని సూచించారు. కార్యక్రమంలో పీఓ డాక్టర్ అరుణ్‌కుమార్ జోషి, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ స్వప్న మాధురి, ఐసీటీసీ సూపర్‌వైజర్ రామకృష్ణ, అకౌంట్స్ ఆఫీసర్ కమలాకర్, ఐసీటీసీ కౌన్సెలర్లు, సహయోగి స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## మిల్క్ సెంటర్‌పై టాస్క్‌ఫోర్స్ దాడి



**కాకతీయ, వరంగల్ బ్యూరో :** అనుమతులు లేకుండా, అపరిశుభ్ర పరిస్థితుల్లో పాల ఉత్పత్తులు విక్రయిస్తున్నారనే సమాచారంతో వరంగల్ నగరంలోని చార్‌బౌలిలో ఉన్న వారంగల్ మిల్క్ సెంటర్‌పై టాస్క్‌ఫోర్స్ పోలీసులు శుక్రవారం దాడి చేశారు. ఈ తనిఖీల్లో రూ.1,29,065 విలువైన నెయ్యి, ఖోవా, మలై, బ్రెడ్ తదితర ఆహార పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. మిల్క్ సెంటర్ నిర్వాహకుడు విరాణి మురాద్ (తండ్రి మన్సూర్ అలీ)ను అదుపులోకి తీసుకున్నారు. ప్రభుత్వ అనుమతులు, అవసరమైన లైసెన్సులు లేకుండా వ్యాపారం నిర్వహిస్తున్నట్లు, ఉత్పత్తుల నిల్వ, పరిశుభ్రత, నాణ్యత ప్రమాణాల విషయంలో నిబంధనలు పాటించనట్లు పోలీసులు గుర్తించారు. అపరిశుభ్ర పరిస్థితుల్లో ఆహార పదార్థాలను నిల్వ చేసి విక్రయించడం ప్రజారోగ్యానికి ముప్పుగా మారే అవకాశం ఉందని తెలిపారు. దాడిలో 15 కిలోల చొప్పున ఉన్న 6 నెయ్యి డబ్బాలతో పాటు వివిధ పరిమాణాల్లోని నెయ్యి ప్యాకెట్లు, బకెట్లు, ఖోవా, మలై ప్యాకెట్లు, 39 బ్రెడ్ ముక్కలను స్వాధీనం చేసుకున్నారు. తదుపరి చర్యల కోసం నిర్వాహకుడితో పాటు స్వాధీనం చేసుకున్న ఉత్పత్తులను వరంగల్ జిల్లా ఆహార భద్రతాధికారులకు అప్పగించారు. దాడిలో ఏసీపీ ఏ. మధుసూదన్, ఇన్‌స్పెక్టర్ జి. శుభారెడ్డి, ఎస్ఐ బి. ఉప్పలయ్య, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

## పల్లె సీను పుస్తకాల ఆవిష్కరణ మహోత్సవం

- సహస్ర చంద్ర దర్శన వేళ సాహిత్య సంబరం
- అక్టోబర్ 11న హరిత కాకతీయలో వేడుక
- శ్రీలేఖ సాహితి అధ్యక్షుడు టీ. శ్రీరంగ స్వామి






**కాకతీయ, హనుమకొండ :** శ్రీలేఖ సాహితి, వరంగల్లు స్వర్ణోత్సవ సంవత్సరాన్ని పురస్కరించుకొని ప్రముఖ రచయిత, శ్రీలేఖ సాహితి ఉపాధ్యక్షుడు పల్లె సీను సహస్ర చంద్ర దర్శన వేళ పుస్తకాల ఆవిష్కరణ మహోత్సవాన్ని ఆదివారం నిర్వహించనున్నారు. అక్టోబర్ 11న ఉదయం 10 గంటలకు హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో కార్యక్రమం జరుగుతుందని శ్రీలేఖ సాహితి అధ్యక్షుడు టీ. శ్రీరంగ స్వామి తెలిపారు. ఈ సందర్భంగా పల్లె సీను రచించిన గగన తరంగాలు, మైత్రీ భావ తరంగాలు, పల్లె అంతరంగం, నేను కవిత్వాన్ని, నా సాహిత్య సంబంధాలు పుస్తకాలను ఆవిష్కరించనున్నారు. ఈ వేడుకలో డా. దహగాం సాంబమూర్తి, ఐతా చంద్రయ్య, డా. మడత భాస్కర్, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు డా. రియాజ్, కందుకూరి శ్రీరాములు, ఒద్దిరాజు ప్రవీణ్‌కుమార్, డా. పర్చా అంజనీదేవి, టీ. ఉదయవర్లు, డా. అమ్మిన శ్రీనివాసరాజు, రచయిత, సీనియర్ జర్నలిస్ట్ శంకేశి శంకర్రావు, వరిగొండ కాంతారావు, డా. ఊరె సత్యవాణి, డా. ఎన్‌వీఎన్ చారి, గుడిపాటి, డా. పల్లేరు వీరాస్వామి తదితరులు పాల్గొననున్నారు. సాహితీ మిత్రులు, అభిమానులు ఈ కార్యక్రమానికి హాజరుకావాలని నిర్వాహకులు కోరారు.

## అసభ్యంగా ప్రవర్తించిన ప్రధానోపాధ్యాయుడు సస్పెండ్

**కాకతీయ, హనుమకొండ :** వడ్డెపల్లిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎల్. నరేందర్ నాయక్‌ను విద్యాశాఖ సస్పెండ్ చేసింది. బాలికల పట్ల అనుచితంగా ప్రవర్తించడంతోపాటు అసభ్య పదజాలం ఉపయోగించారని, ఇతర దుష్ప్రవర్తనకు పాల్పడ్డారని తల్లిదండ్రుల నుంచి ఫిర్యాదులు రావడంతో ఈ చర్యలు చేపట్టింది. పాఠశాలలో ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న నరేందర్ నాయక్‌పై వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో పోలీసులు, చైల్డ్ హెల్ప్‌లైన్ సిబ్బంది జోక్యం చేసుకున్నారు. తెలంగాణ స్టూడెంట్స్ ఫెడరేషన్‌తోపాటు పలు విద్యార్థి సంఘాలు ఈ వ్యవహారంపై స్పందించి చర్యలు తీసుకోవాలని అధికారులకు వినతిపత్రాలు సమర్పించాయి. ఘటనకు సంబంధించిన వివరాలను హనుమకొండ జిల్లా కలెక్టర్, మేజిస్ట్రేట్ పరిశీలించి సస్పెన్షన్‌కు ఆమోదం తెలిపారు. దీంతో జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.వి. గిరిరాజ్ గౌడ్ తెలంగాణ సివిల్ సర్వీసెస్ (సీసీఏ) నిబంధనలు-1991 ప్రకారం తక్షణమే సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. క్రమశిక్షణా చర్యలు పూర్తయ్యే వరకు సస్పెన్షన్ అమల్లో ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థుల భద్రత, గౌరవం, సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ ఫిర్యాదులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

# పారదర్శక పాలనకు రాష్ట్రస్థాయి గుర్తింపు

- సమాచార హక్కు చట్టం అమలులో హనుమకొండకు అవార్డు
- గవర్నర్ చేతుల మీదుగా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయికి పురస్కారం




**కాకతీయ, హనుమకొండ:** సమాచార హక్కు చట్టం అమలులో ఉత్తమ పనితీరు కనబరిచినందుకు హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి రాష్ట్రస్థాయి అవార్డును అందుకున్నారు. ప్రభుత్వ పాలనలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంపొందించేందుకు జిల్లా యంత్రాంగం చేసిన కృషికి ఈ పురస్కారం దక్కింది. శుక్రవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సమాచార హక్కు వారోత్సవాలు 2026 కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా చేతుల మీదుగా కలెక్టర్ ఈ అవార్డును స్వీకరించారు. జిల్లాలో సమాచార హక్కు చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు ప్రభుత్వ పాలనకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలకు అందుబాటులో ఉంచడం, చట్ట లక్ష్యాలను సాధించడం వంటి అంశాల్లో జిల్లా యంత్రాంగం కనబరిచిన పనితీరు ఈ గుర్తింపునకు దోహదపడింది. ఈ అవార్డు ప్రజాకేంద్రిత పాలనను మరింత బలోపేతం చేసేందుకు ప్రోత్సాహాన్నిస్తుందని కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు ప్రభుత్వ కార్యకలాపాల్లో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పాటిస్తూ సమర్థవంతమైన పరిపాలన అందించేందుకు జిల్లా యంత్రాంగం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. గవర్నర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న కలెక్టర్ చాహత్ బాజ్‌పాయిని పలువురు అధికారులు, సిబ్బంది అభినందించారు.

సింగరేణి ప్రతిపాదిత ఓపెన్‌కాస్ట్ గనితో రామప్ప ఆలయం, సరస్సుకు ముప్పు తప్పదు. 300 మీటర్ల లోతు వరకు తవ్వకాలు చేపట్టాలని ప్రతిపాదించిన గని ప్రాంతం రామప్ప సరస్సు, ఆలయానికి దిగువ ప్రవాహ దిశలో సుమారు 5 కిలోమీటర్ల దూరంలో ఉంది. అక్కడ చేపట్టే తవ్వకాలు, బ్లాస్టింగులతో భూమి లోపల ఇప్పటికే ఉన్న చీలికలు మళ్లీ క్రియాశీలమవుతాయి. వాటి ద్వారా సరస్సు నీరు భూగర్భంలోకి లీకవుతుంది. నీటి ప్రవాహంలో మార్పులు, కట్ట కింద భూగర్భ పరిస్థితులపై ప్రభావం కారణంగా రామప్ప సరస్సు కట్ట తెగే ప్రమాదం తీవ్రంగా ఉంటుంది. కట్ట తెగితే దిగువ ప్రాంతాల్లోని ఆస్తులు, పంటలు, ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లడంతోపాటు రామప్ప ఆలయ పరిసరాలు తీవ్రంగా దెబ్బతింటాయి. ఓపెన్‌కాస్ట్ పేలుళ్ల ప్రకంపనలు ఆలయ నిర్మాణంపై దీర్ఘకాలిక ప్రభావం చూపుతాయి. ఈ పరిణామాలు రామప్ప ఆలయ భద్రతతోపాటు యునెస్కో ప్రపంచ వారసత్వ గుర్తింపుపైనా ప్రభావం చూపుతాయి. కాకతీయుల అపూర్వ సాంస్కృతిక, కళా సంపదను ప్రమాదంలోకి నెట్టే ఈ గని విషయంలో ప్రభుత్వాలు తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని కాకతీయ హెరిటేజ్ ట్రస్టీ, ఇన్‌టాక్ (INTACH) వరంగల్ చాప్టర్ కన్వీనర్, వరంగల్ నిట్ రిటైర్డ్ ప్రొఫెసర్ ఎం. పాండురంగారావు స్పష్టం చేశారు. తెలంగాణ డిజిటల్ మీడియా యూనియన్ ప్రతినిధులతో మాట్లాడిన ఆయన, ప్రతిపాదిత ఓపెన్‌కాస్ట్ గని వల్ల తలెత్తే ప్రమాదాలను, వాటి వెనుక ఉన్న భౌగోళిక కారణాలను వివరించారు.

*- కాకతీయ, తెలంగాణ బ్యూరో*

# ఓపెన్ కాస్టుతో రామప్పకు ముప్పు తప్పదు

## సరస్సు నీరు భూగర్భంలోకి లీకయ్యే ప్రమాదం

- ఇప్పటికే భూమి లోపల చీలికలు ఏర్పడ్డాయి
- ఓపెన్ కాస్టుల బ్లాస్టింగులతో అవి రీయాక్టివేట్ అయ్యే అవకాశం
- రామప్ప సరస్సు కట్ట తెగే ప్రమాదం ఎక్కువగా ఉంది
- పేలుళ్ల ప్రకంపనల ప్రభావం దీర్ఘకాలంలో కనిపించొచ్చు
- గతంలో నిర్వహించిన జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా నివేదికలోనూ ఉంది
- చెరువు కట్ట తెగేతే రామప్ప ఆలయ పరిసరాలు పూర్తి ధ్వంసమవుతాయి
- ఆస్తి, ప్రాణ నష్టం వాటిల్లేందుకు ఆస్కారం ఉంది
- సింగరేణి ఓపెన్ కాస్టు ప్రారంభించే విషయంలో తొందరపాటు పనికిరాదు
- ఓపెన్ కాస్టు ప్రారంభిస్తే రామప్పకు యూనెస్కో గుర్తింపు కూడా పోతుంది
- కాకతీయ హెరిటేజ్ ట్రస్టు ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు లేఖలు రాశాం
- కాకతీయ సాంస్కృతిక, కళా సంపద పరిరక్షణపై ప్రభుత్వం దృష్టిపెట్టాలి
- తెలంగాణ డిజిటల్ మీడియాతో ప్రొఫెసర్ ఎం. పాండు రంగారావు



## భూగర్భ చీలికలే ప్రధాన ముప్పు

ఇందుకోసం కర్ణాటకలోని సూరత్‌కల్ నిట్ వారు అధ్యయనం చేసి, ఓపెన్ కాస్ట్ మైన్‌తో రామప్ప ఆలయానికి పెద్దగా ప్రమాదం లేదని రిపోర్టు ఇచ్చిందని సింగరేణి యాజమాన్యం చెబుతోంది. అలాగే, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు నుంచి కూడా ఎన్‌వోసీ తీసుకున్నామని అంటోంది. అంతేగాకుండా, భూగర్భాన్ని భూమి పొరలనూ సర్వే చేసేందుకు నెలకొల్పిన సంస్థ జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ) నుంచి కూడా అనుమతి పొందినట్లు సింగరేణి యాజమాన్యం చెబుతోంది. అయితే రామప్ప ఆలయం, సరస్సు భద్రతను అంచనా వేసేటప్పుడు గని ప్రాంతానికి ఉన్న దూరాన్ని మాత్రమే ప్రాతిపదికగా తీసుకోవద్దు. భూమి లోపల ఉన్న రాతి పొరలు, వాటి అమరిక, భ్రంశాలు, చీలికలు, భూగర్భ జలాల ప్రవాహ మార్గాలే కీలకం. వెంకటాపురం వద్ద ప్రతిపాదించిన గని ప్రాంతం, రామప్ప సరస్సు మధ్య భూగర్భ సంబంధం ఉంది. ఈ ప్రాంతంలోని భౌగోళిక నిర్మాణాలను పరిశీలిస్తే రాతి పొరల్లో ప్రధాన, ఉప భ్రంశాలు, పగుళ్లు, జాయింట్లు విస్తరించి ఉన్నట్లు మా కాకతీయ హెరిటేజ్ ట్రస్టు రూపొందించిన పటంలో చూపించాం. భూమిపై కనిపించని ఈ చీలికలు భూగర్భంలో నీటి ప్రవాహానికి మార్గాలుగా పనిచేస్తాయి. ఓపెన్‌కాస్ట్ తవ్వకాలు, బ్లాస్టింగుల వల్ల భూమి లోపలి సహజ నిర్మాణంపై ఒత్తిడి ఏర్పడుతుంది. దాంతో ఇప్పటికే ఉన్న చీలికలు మళ్లీ క్రియాశీలమవుతాయి. ఈ మార్పులు భూగర్భ జలాల కదలికపై ప్రభావం చూపుతాయి. గని ప్రాంతానికి, సరస్సుకు మధ్య ఉన్న భౌగోళిక అనుసంధానాన్ని విస్మరించడం వల్లే ప్రమాద తీవ్రతను తక్కువగా అంచనా వేసే పరిస్థితి ఏర్పడుతుంది. అందుకే ఈ గని ప్రభావాన్ని భూమిపై కనిపించే దూరంతో కాకుండా, భూగర్భ నిర్మాణం ఆధారంగా అర్థం చేసుకోవాలి.

రామప్ప ఆలయ నిర్మాణంలో ఉపయోగించిన సాండ్ బాక్స్ టెక్నాలజీ కాకతీయుల ఇంజినీరింగ్ నైపుణ్యానికి నిదర్శనం. పునాది భాగంలో ఇసుకను నింపి, దాని మీద ఆలయ నిర్మాణ భారాన్ని మోయించే విధానాన్ని ఉపయోగించారు. అంటే ఇక్కడ పరిమిత ఇసుక మాత్రమే ఉంటుంది. భూగర్భ జలాల ప్రవాహం వల్ల రామప్ప ఆలయ పునాదిగా ఉన్న ఈ ఇసుక పెట్టె నిర్మాణం బలహీన పడుతుంది. రామప్ప దేవాలయంపై పేలుళ్ల ప్రభావం ప్రస్తుతం తక్కువగానే ఉండవచ్చని నివేదికలు సూచిస్తున్నప్పటికీ, దీర్ఘకాలంలో పదేపదే సంభవించే ప్రకంపనలు దేవాలయంపై తీవ్ర ప్రభావాన్ని చూపే ప్రమాదం ఉంది. నిరంతర పేలుళ్లతో కాలక్రమేణా తీవ్ర నష్టం జరుగుతుంది. శతాబ్దాలుగా నిలిచి ఉన్న ఈ నిర్మాణం భూగర్భ

## పేలుళ్ల ప్రకంపనలతో ఆలయ నిర్మాణానికి నష్టం

కారణంగా పునాదుల్లోని ఇసుక, మట్టి రేణువులు కొట్టుకుపోయి (పైపింగ్ ఫినామినా) అంతర్గత ఖాళీలు ఏర్పడుతాయి. దీనివల్ల రామప్ప దేవాలయ పునాదుల స్థిరత్వానికి ముప్పు ఏర్పడే ప్రమాదం ఉందని జీఎస్ఐ తన నివేదికలో హెచ్చరించింది. రామప్ప చెరువు, దేవాలయం గుండా పరస్పరం అనుసంధానమై విస్తరించిన భౌగోళిక చీలికల వెంట నీరు ప్రవహించడం పరిస్థితుల్లో వచ్చే మార్పులకు అతీతం కాదు. ఆలయంలోని రంగమండపంలో భారీ నేల దూలాలకు పగుళ్లు, నిర్మాణంలో అసమాన కూర్చివేత వంటి అంశాలను మా ట్రస్టు నివేదికలో ప్రస్తావించాం. భూకంపాలు, భూగర్భ జలాల హెచ్చుతగ్గులు, భౌగోళిక చీలికలు వంటి అంశాలు నిర్మాణంపై ప్రభావం చూపే పరిస్థితులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఓపెన్‌కాస్ట్ గనిలో నిర్వహించే బ్లాస్టింగుల ప్రకంపనలు ఆలయ నిర్మాణంపై దీర్ఘకాలిక ప్రభావం చూపుతాయి. పేలుళ్ల సమయంలో ఏర్పడే ప్రకంపనలు నేల ద్వారా వ్యాపించి పునాది, దూలాలు, రాతి నిర్మాణాలపై ఒత్తిడిని కలిగిస్తాయి. ఒక్కసారి వచ్చే ప్రకంపనల ప్రభావం కంటే, పదేపదే జరిగే పేలుళ్ల వల్ల ఏర్పడే ప్రకంపనల ప్రభావం కాలక్రమంలో తీవ్రతరం అవుతుంది. ఇప్పటికే నిర్మాణపరమైన మార్పులు కనిపిస్తున్న పురాతన ఆలయానికి ఇలాంటి అదనపు ప్రభావం ప్రమాదకరం. అందుకే రామప్ప ఆలయాన్ని కాపాడాలంటే ఓపెన్‌కాస్ట్ బ్లాస్టింగులను అనుమతించకూడదు. ఈ ప్రమాదాన్ని కేవలం తక్షణ ప్రకంపనల స్థాయితో కొలవలేం. ఆలయ నిర్మాణం, పునాది స్థిరత్వం, చారిత్రక వారసత్వ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని నిర్ణయం తీసుకోవాలి.





## సరస్సు నీరు లీకై కట్ట తెగే ప్రమాదం

ఈ ప్రాంతం ప్రాణహిత-గోదావరి గ్రాబెన్ బేసిన్‌లో భాగంగా ఉంది. ఇక్కడ పాఖాల్, సుల్లావాయి, దిగువ గోండ్వానా, ఎగువ గోండ్వానా శిలా నిర్మాణాలతోపాటు ఇసుకరాయి, షేల్, కంకర పొరలు, బొగ్గు నిల్వలున్న భౌగోళిక నిర్మాణాలు ఉన్నాయి. రాతి పొరల్లోని చీలికలు, భ్రంశాలు, జాయింట్లు భూగర్భ జలాల ప్రవాహాన్ని ప్రభావితం చేస్తాయి. గని తవ్వకాలు 300 మీటర్ల లోతు వరకు సాగినప్పుడు అక్కడి భూగర్భ జలాల స్థాయి, నీటి పీడనంలో మార్పులు ఏర్పడతాయి. ఇప్పటికే ఉన్న చీలికలు మళ్లీ క్రియాశీలమవడంతో రామప్ప సరస్సు నీరు భూగర్భంలోకి లీకయ్యే పరిస్థితి ఏర్పడుతుంది. సరస్సులో నిల్వ ఉన్న నీరు భూగర్భ మార్గాల ద్వారా బయటకు వెళ్లడం వల్ల కట్ట కింద భూగర్భ పరిస్థితులు మారతాయి. రామప్ప సరస్సు కట్ట రెండు కొండలను అనుసంధానిస్తూ నిర్మించిన మట్టి కట్ట. మా ట్రస్టు నివేదికలో కట్టకు కట్‌ఆఫ్ ట్రెంచ్ లేదన్న అంశాన్ని ప్రస్తావించాం. కట్‌ఆఫ్ ట్రెంచ్ అనేది కట్ట కింద నీరు భూగర్భంలోకి ప్రవహించడాన్ని నియంత్రించే నిరోధక నిర్మాణం. ఈ నిర్మాణం లేకపోవడం, భూగర్భ చీలికల ద్వారా నీటి ప్రవాహం పెరగడం వంటి అంశాలు కట్ట భద్రతకు ముప్పుగా మారతాయి. సుమారు 3 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం కలిగిన రామప్ప సరస్సు దాదాపు 30 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తోంది. ఇంతటి జలవనరు కట్ట తెగితే దిగువ ప్రాంతాల్లోని ప్రజలు, పంటలు, ఆస్తులకు భారీ నష్టం వాటిల్లుతుంది. రామప్ప ఆలయ పరిసరాలు కూడా తీవ్ర విధ్వంసానికి గురవుతాయి. ఈ ప్రమాదాన్ని కేవలం సాంకేతిక అంశంగా చూడకుండా ప్రజల ప్రాణాలు, వ్యవసాయం, వారసత్వ సంపద భద్రతకు సంబంధించిన అంశంగా చూడాలి.




## జియోలాజికల్ సర్వే నివేదికలోనూ కీలక అంశాలు

రామప్ప సరస్సు, ప్రతిపాదిత గని మధ్య భౌగోళిక సంబంధం, భూగర్భ జలాల ప్రవాహం, చీలికల ప్రభావం వంటి అంశాలను మేము కాకతీయ హెరిటేజ్ ట్రస్టు తరఫున ఇప్పటికే ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లాం. 2023 జూన్ 30 తేదీతో ఉన్న జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా నివేదికలోని అంశాలను మా అభ్యంతరాల్లో ప్రస్తావించాం. ఆ నివేదికలోని 21, 22 పేజీలకు సంబంధించిన వివరాలు రామప్ప సరస్సు నీటి మట్టం, భూగర్భ జలాల కదలిక, ప్రతిపాదిత గని తవ్వకాల ప్రభావాన్ని అర్థం చేసుకోవడంలో కీలకమైనవి. భూగర్భ చీలికలు, రాతి పొరల నిర్మాణం, నీటి ప్రవాహ మార్గాలను విడివిడిగా కాకుండా పరస్పర సంబంధంతో పరిశీలించాలి. ఈ భౌగోళిక పరిస్థితుల నేపథ్యంలో గని తవ్వకాలు చేపట్టడం వల్ల సరస్సు నీటి భద్రతపై ప్రభావం పడుతుంది. మా ట్రస్టు ఈ అంశాలను ఆధారాలతో వివరించింది. అయినప్పటికీ గని ప్రతిపాదనపై నిర్ణయం తీసుకునేటప్పుడు సరస్సు కట్ట భద్రత, భూగర్భ జలాల ప్రవాహం, ఆలయ నిర్మాణ స్థిరత్వం వంటి అంశాలకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలి. శాస్త్రీయ నివేదికల్లో ఉన్న అంశాలను పరిగణనలోకి తీసుకోకుండా గని వల్ల ఎలాంటి ప్రమాదం లేదని చెప్పడం సరికాదు. ఈ నివేదికలోని వివరాలను సంబంధిత శాఖలు సమగ్రంగా పరిగణనలోకి తీసుకుని, రామప్ప ఆలయం, సరస్సు భద్రతకు సంబంధించిన అంశాలపై బాధ్యతాయుతమైన నిర్ణయం తీసుకోవాలి.

## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు మా విజ్ఞప్తి

సింగరేణి వెంకటాపురం వద్ద ఓపెన్‌కాస్ట్ గని ప్రారంభించేందుకు పాలంపేట ప్రత్యేక అభివృద్ధి సంస్థ నుంచి నిరభ్యంతర ధ్రువపత్రం కోరినప్పటి నుంచే మేము అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాం. 2023 మార్చి 1న ములుగు జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగిన సమావేశం, 2023 మార్చి 28న కలెక్టర్ నుంచి వచ్చిన లేఖ, అదే ఏడాది ఏప్రిల్ 1న మేము పంపిన లేఖ, 2024 డిసెంబరు 19న జరిగిన సమావేశం వంటి అంశాలను 2025 జనవరి 27న కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డికి పంపిన లేఖలో వివరించాం. రామప్ప ఆలయం, సరస్సుకు గని వల్ల కలిగే ప్రమాదాలపై మా అభ్యంతరాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లాం. 2026 అక్టోబరు 3న సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాశ్ జ్యోతికి కూడా లేఖ రాసి, గని ప్రతిపాదన ప్రభావాలను వివరించేందుకు వ్యక్తిగతంగా కలిసే అవకాశం ఇవ్వాలని కోరాను. గని అనుమతుల ప్రస్తుత స్థితి, పాలంపేట ప్రత్యేక అభివృద్ధి సంస్థ నిరభ్యంతర ధ్రువపత్రం, పర్యావరణ అనుమతుల ప్రక్రియ, జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా నివేదికపై తీసుకున్న చర్యల వివరాలను సింగరేణి యాజమాన్యం స్పష్టంగా వెల్లడించాలి. రామప్ప ఆలయం, సరస్సు భద్రతకు ముప్పు కలిగించే ఈ ప్రతిపాదనపై తొందరపాటు నిర్ణయం తీసుకోవద్దు. కాకతీయుల సాంస్కృతిక, కళా సంపదను కాపాడటమే ప్రభుత్వాల ప్రధాన బాధ్యతగా ఉండాలి. రామప్ప ఆలయానికి, సరస్సుకు ముప్పు తెచ్చే ఓపెన్‌కాస్ట్ గని ప్రతిపాదనను పునః పరిశీలించి, వారసత్వ సంపదను రక్షించే నిర్ణయం తీసుకోవాలని నేను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరుతున్నాను.

## యునెస్కో గుర్తింపు, కాకతీయుల వారసత్వం ప్రమాదంలో

రామప్ప ఆలయానికి యునెస్కో ప్రపంచ వారసత్వ గుర్తింపు సాధించడం వెనుక కాకతీయ హెరిటేజ్ ట్రస్టు, భారత పురావస్తు సర్వేక్షణ శాఖ, తెలంగాణ వారసత్వ శాఖ, జిల్లా యంత్రాంగం దశాబ్దానికి పైగా చేసిన కృషి ఉంది. 2021 జూలై 25న ఆలయానికి ప్రపంచ వారసత్వ గుర్తింపు లభించింది. కాకతీయుల నిర్మాణ కళ, శిల్ప సంపద, ఇంజినీరింగ్ ప్రతిభకు అంతర్జాతీయ స్థాయిలో లభించిన గుర్తింపు ఇది. ఇప్పుడు ఈ వారసత్వ సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. ఓపెన్‌కాస్ట్ తవ్వకాలు, బ్లాస్టింగుల వల్ల భూగర్భ చీలికలు క్రియాశీలమై, సరస్సు నీరు లీకై, కట్ట తెగే పరిస్థితి ఏర్పడితే ఆలయ పరిసరాలు తీవ్రంగా దెబ్బతింటాయి. పేలుళ్ల ప్రకంపనలతో ఆలయ నిర్మాణానికి నష్టం కలిగితే ప్రపంచ వారసత్వ ప్రదేశంగా దాని పరిరక్షణపై కూడా తీవ్రమైన ప్రశ్నలు తలెత్తుతాయి. రామప్పకు లభించిన యునెస్కో గుర్తింపు నిలవాలంటే ఆలయాన్ని మాత్రమే కాకుండా దాని చుట్టూ ఉన్న సహజ, భౌగోళిక పరిస్థితులు, సరస్సు భద్రతను కూడా కాపాడాలి. బొగ్గు ఉత్పత్తి అవసరాల కోసం శతాబ్దాల చరిత్ర కలిగిన



వారసత్వ సంపదను ప్రమాదంలోకి నెట్టడం సమంజసం కాదు. ఈ అంశాలన్నింటినీ దృష్టిలో ఉంచుకుని సింగరేణి ఓపెన్‌కాస్ట్ గని ప్రతిపాదనను నిలిపివేయాలని నేను కోరుతున్నాను.



ఉత్తరం కాకతీయ ఎడిటర్/
- కిరణ్ గౌడ్ అరెల్లి
7396604266

Printed and published owned by kiran goud arelli be half of amulya publications & printers graphics. printed at hanamkonda and published at H No. 5-12-42, pvr residency, hanuman nagar, hanamkonda- 506009- EDITOR- ARELLI KIRAN GOUD - RNI NO. TG TEL/25/A1234 - contact - 7396604266